

# సద్దుల బతుకమ్మకు సర్వం సిద్ధం



మానేరు వాగులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

- రూ. 2 కోట్లతో ఏర్పాట్లు
- 21 ప్రాంతాల్లో నిమజ్జన పాయింట్లు
- 60 డివిజన్లలో బతుకమ్మ ఆడేందుకు ప్రత్యేక ఏర్పాట్లు

కార్పొరేషన్, అక్టోబర్ 21: నగరంలో సద్దుల బతుకమ్మ, దసరా పండుగ ఏర్పాట్లపై నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టిసారించింది. ఇప్పటికే నగరంలోని 60 డివిజన్లలో బతుకమ్మ ఆడే ప్రాంతాలతో పాటు నిమజ్జన కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున్న ఏర్పాట్లు చేస్తున్నది. ఏర్పాట్ల కోసం నగరపాలక సంస్థ రూ. 2 కోట్లు కేటాయించింది. సద్దుల బతుకమ్మ పండుగకు ఎక్కడా కూడా మహిళలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడుతున్నారు. నగరంలో సద్దుల బతుకమ్మ ఆడే అన్ని ప్రాంతాల్లో, నిమజ్జన కేంద్రాలకు వెళ్లే రహదారుల్లోనూ భారీ ఎత్తున లైటింగ్‌తో పాటు ఇతర సదుపాయాల విషయంలోనూ చర్యలు చేపడుతున్నారు. నగరంలో 21 నిమజ్జన కేంద్రాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశారు. అన్ని డివిజన్లలో బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో చదును చేయడంతో పాటు లైటింగ్ సదుపాయం, మంచినీటి వసతి కల్పిస్తున్నారు. అన్ని ప్రాంతాల్లోనూ నీరు ఎక్కువగా ఉన్నందున ఎలాంటి సంఘటనలు జరుగకుండా ఉండేందుకు వీలుగా ముందస్తుగా అన్ని ప్రాంతాల్లో పటిష్టమైన భారీ కేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు అన్ని ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను అందుబాటులోకి ఉంచుతున్నారు.

**భారీగా ఏర్పాట్లు**

నగరంలో ఈసారి సద్దుల బతుకమ్మ కోసం భారీగా ఏర్పాట్లు చేశారు. నగరంలోని 21 ప్రాంతాల్లో నిమజ్జన పాయింట్లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో భారీగా లైటింగ్‌తో పాటు ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారు. ముఖ్యంగా ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద తప్పనిసరిగా ముగ్గురు చొప్పున గజ ఈతగాళ్లను ఉంచనున్నారు. మొత్తం 21 ప్రాంతాలకు 0కలిపి 63 మంది ఈతగాళ్లు అందుబాటులో ఉంచుతారు. నగరంలోని మానేరు వాగు వెంట, కిసాన్‌నగర్‌లోని గార్లకుంట, మార్క్‌ఫెడ్, చింతకుంట, వేద భవనం (మానేరు బ్రిడ్జి) సమీపంలోని వాగు, ఎల్ఎండీ డ్యాం కట్ట వెంట వాటర్ ట్యాంక్ సమీపంలో, గౌతమినగర్ పీజీ కాలేజ్ సమీపంలో, రాంచంద్రాపూర్ సమీపంలో, శ్రీనగర్ కాలనీ, సప్తగిరికాలనీ, మార్కండేయనగర్, మానకొండూర్, కొత్తపల్లి, రేకుర్తి చెరువుల వద్ద, వల్లంపహాడ్ బ్రిడ్జి, తీగలగుట్టపల్లి కెనాల్ వద్ద అన్ని సదుపాయాలు కల్పించారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో లైటింగ్, ఇతర సదుపాయాలు కల్పించారు. ముఖ్యంగా స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి ఆ మేరకు సదుపాయాలను కల్పించే దిశగా చర్యలు చేపట్టారు. నిమజ్జన ప్రాంతాల్లో ఇబ్బందులు రాకుండా భారీకేడ్లు ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. ముఖ్యంగా బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లలో అత్యధికంగా లైటింగ్ కోసమే వ్యయం చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. డ్యాం, ఇతర ప్రాంతాల్లోనూ నీళ్లు ఎక్కువగా ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు వీలుగా లైటింగ్ ఏర్పాటుపై దృష్టి పెట్టారు. అలాగే, ఆయా కాలనీల నుంచి డ్యాం వైపు వెళ్లే రహదారుల్లోనూ ప్రస్తుతం ఉన్న వీధి దీపాలకు తోడు ప్రత్యేకంగా వీధుల్లోనూ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. నగరంలోని 60 డివిజన్లలో బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో అందమైన ముగ్గులు కూడా వేయించారు. పలు డివిజన్లలో మహిళలు ఆడుకోవడా నికి వీలుగా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు.

**ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు**

నగరంలో బతుకమ్మ పండుగకు ఎక్కడా కూడా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. నిమజ్జన ప్రాంతాల వద్ద పూర్తిస్థాయిలో లైటింగ్, బారీ కేడ్లను ఏర్పాటు చేశాం. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లుగానే ఈసారి కూడా బతుకమ్మకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఏర్పాట్లను అధికారులు ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారు.

**- శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్**

## అట్టహాసంగా లలితా సహస్రనామ పారాయణం



నిర్వాహకురాలు మయూరిని సత్కరిస్తున్న నగర ప్రముఖులు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 21: జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌లో గల తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మించే స్థలంలో శనివారం సాయంత్రం శ్రీ కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో లలితా సహస్రనామ పారాయణం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా సహస్రనామ పారాయణం రాగయుక్తంగా, భక్తిశ్రద్ధలతో భక్తులు ఆలపించారు. తితిదే తమిళనాడు సభ్యురాలు, కంచి కామాక్షి దేవాలయం సభ్యురాలు మయూరి ఆధ్వర్యంలో, తితిదే స్థల శుద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పారాయణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పారాయణం ముందు పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యురాలు డాక్టర్ పద్మజారెడ్డి శిష్య బృందంచే మహిషాసుర సంహారం కూచిపూడి శాస్త్రీయ నృత్యం ఆద్యంతం ఆకట్టుకుంది. కార్యక్రమంలో నిర్వాహకురాలు మయూరి, వ్యాఖ్యాత నంది శ్రీనివాస్, మార్కెట్ రోడ్డు వేంకటేశ్వర స్వామి ఆలయ ట్రస్టీ సభ్యుడు చకిలం గంగాధర్, కమిటీ సభ్యుడు గంప రమేశ్, గోగుల ప్రసాద్, ఫణిత, రుద్ర రాధ, మహేందర్ భక్తులు పాల్గొన్నారు.

## మండలి విప్ నివాసంలో బతుకమ్మ వేడుకలు

- హాజరైన వీణవంక, ఇల్లందకుంట, హుజూరాబాద్ ఎంపీపీలు , ఇతర ప్రజాప్రతినిధులు



బతుకమ్మను పేరుస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి సతీమణి, ఎంపీపీలు, స్థానిక మహిళలు

వీణవంక, అక్టోబర్ 21: మండల కేంద్రంలో మండలి విప్, బీఆర్ఎస్ హుజూరాబాద్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి నివాసంలో ఆయన సతీమణి శాలినీరెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. వీణవంక, ఇల్లందకుంట, హుజూరాబాద్ ఎంపీపీలు ముసిపట్ల రేణుక–తిరుపతిరెడ్డి, సరిగొమ్ముల పావని–వెంకటేశ్, రాణి–సురేందర్‌రెడ్డి, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక–శ్రీనివాస్ హాజరై తీరొక్క పూలతో బతుకమ్మను అందంగా పేర్చారు. సాయంత్రం ఇంటి ఆవరణలో బతుకమ్మ పెట్టి పాటలు పాడుతూ, కోలాటం ఆడారు. అలాగే, నియోజకవర్గ ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలంతా పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. వీణవంక వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత–శ్రీనివాస్, స్థానిక మహిళలు నీల లక్ష్మి, రాజేశ్వరీ, తాళ్లపెల్లి రాణి, జ్యోతి, బొడిపెల్లి దేవక్క, రాణి, గొడుగు లావణ్య, నర్సమ్మ పాల్గొన్నారు.

## మంత్రి గంగులను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



మంత్రి గంగుల కమలాకర్‌తో బీఆర్ఎస్ నాయకులు

గంగాధర, అక్టోబర్ 21: రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్‌ను శనివారం కరీంనగర్‌లోని కార్యాలయంలో గంగాధర మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలను మంత్రికి విన్నవించగా పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కాగా, సమస్యలపై సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మంత్రి గంగుల కమలాకర్‌కు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ ఎంపీపీ శ్రీరాం మధుకర్, గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, ఎంపీటీసీలు అట్ల రాజిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.

## ఉన్నత విద్యా శాఖ కమిషనర్‌ను కలిసిన అధ్యాపకులు



ఉన్నత విద్యా శాఖ కమిషనర్ వాకాటి కరుణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 21: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల న్యాక్ 'ఏ' గ్రేడ్ సాధించిన క్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టీ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో అధ్యాపకుల బృందం ఉన్నత విద్యా శాఖ కమిషనర్ వాకాటి కరుణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కళాశాలలో తరగతుల నిర్వహణ, విద్యార్థుల పురోగతి, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు కళాశాల బృందం ఉన్నత విద్యాశాఖ మాజీ కమిషనర్ నవీన్ మిట్టల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇక్కడ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి



బస్టాండ్ పరిసరాలను పరిశీలిస్తున్న జోనల్ ఈడీ వినోద్‌కుమార్

- ఆర్టీసీ జోనల్ ఈడీ వినోద్‌కుమార్

తెలంగాణచౌక్, అక్టోబర్ 21: ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని కరీంనగర్ జోనల్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌ను శనివారం ఆయన పరిశీలించారు. వివిధ ప్రాంతాలకు వెళ్తున్న ప్రయాణికులతో మాట్లాడి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రయాణికుల రద్దీ బట్టి బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానం చేర్చడంలో డ్రైవర్లు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. నిబంధనల ప్రకారం బస్సులను నడపాలని. స్పీడ్‌గా నడపడం కానీ ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేయడం లాంటి ప్రమాదకర చర్యలు చేయవద్దన్నారు. బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, టాయ్‌లెట్స్, ఫ్యాన్లు నిత్య పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బస్సుల రాకపోకల వివరాలను మైక్ ద్వారా ప్రయాణికులకు తెలియజేయాలన్నారు. కంట్రోలర్లు, సిబ్బంది ప్రయాణికులకు ఆర్టీసీ అందిస్తున్న స్కీమ్‌లపై అవగాహన కల్పించాలని సూచించారు. సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని ఆయన ప్రజలను కోరారు. జోనల్ పర్సనల్ మేనేజర్ చంద్రయ్య, ఈడీ కార్యదర్శి యుగేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.